ట్రిపుల్ ఐటీలో డ్రోన్ పాఠాలు

■ విద్యా సంస్థల్లో బూట్ క్యాంపుల ఏర్పాటు
■ ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాలకు గుర్తింపు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : నేటి ప్రపంచంలో డ్రోన్ల వినియోగం పెరిగిపోయింది. ప్రతి అంశంలోనూ డ్రోన్లపై ఆధారపడాల్సి వస్తోంది. రానున్న రోజుల్లో వీటి సేవలు మరింత విస్తృతం కానున్నాయి. ఉపాధి అవకాశాలూ మెండుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ ఫర్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్ యూఏఎస్/ డ్రోన్ (స్వయాన్) టెక్నాలజీ' ప్రాజెక్టును కేంద్రం రూపొందించింది. ఇది ఒక జాతీయ ప్రణాళిక. 2030 నాటికి గ్లోబల్ డ్రోన్ హబ్‌గా మార్చడమే స్వయాన్ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల భాగస్వామ్యంగా ఉంది. ఇందులో భాగంగా 2024, ఏప్రిల్ 4వ తేదీన కళాశాలలో డ్రోన్ స్టూడియోను ప్రారంభించారు. ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.



కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం' కళాశాలలో డ్రోన్ ల్యాబ్ స్టూడియో

ఏటా 10,950 మందికి శిక్షణ

ఈ ఏడాదిలో కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల తరపున 10,950 మంది ఉత్సాహవంతులకు డ్రోన్ సాంకేతికతపై శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం, డ్రోన్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులకు అత్యుత్తమ నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలా.. ఏటా వేలాది మంది విద్యార్థులకు డ్రోన్ల సాంకేతికతపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు నైపుణ్యాలు మెరుగుపరుస్తారు.

ఓర్వకల్లులో డ్రోన్ హబ్

డ్రోన్ల సేవలు విస్తృతమవుతున్న నేపథ్యంలో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ ఇన్నోవేషన్ కేంద్రంగా, అమరావతిని డ్రోన్ సిటీ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. డ్రోన్ హబ్ అభివృద్ధి కోసం ఓర్వకల్లులో 300 ఎకరాలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

నైపుణ్యం పెంపొందించేలా

- కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాలలో చేపట్టిన డ్రోన్ ప్రాజెక్టులో భాగంగా గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ టెక్నాలజీ (జీఎన్‌సీ)ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయించారు. జీఎన్‌సీ విధానంలో డ్రోన్లకు స్వయంగా మార్గదర్శకత్వం, నావిగేషన్ కంట్రోల్ సిస్టమ్ రూపొందిస్తారు. ఫలితంగా మానవ నియంత్రణ లేకుండా నిరంతరం పని చేసే సామర్థ్యం ఉంటుంది.
- డ్రోన్ టెక్నాలజీపై ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు, అనంతపురం, గుంటూరులో ఉన్న పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో డ్రోన్ల సాంకేతికతపై బూట్ క్యాంప్‌లు నిర్వహించారు. ముంబయిలో ఇండియన్ నేవీ, తమిళనాడులోని సోనా టెక్నాలజీ కళాశాలలోనూ బూట్ క్యాంపులను కర్నూలు ట్రిపుల్ ఐటీ (డీఎం) కళాశాల ఆధ్వర్యంలో జరగడం విశేషం.

ఆరోసారి శ్రీశైలం నీటి విడుదల



నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

వరద ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం గేట్లను గురువారం ఆరోసారి ఎత్తారు. నాలుగు గేట్లను పది అడుగుల మేర పైకెత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ మరో 67,876 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,89,328 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. జలాశయం నీటిమట్టం 885 అడుగులు, నీటినిల్వ 215.8070 టీఎంసీలుగా నమోదైంది.

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే :

మల్లన్న హుండీ ఆదాయం రూ.2.58 కోట్లు


శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల ఉభయ దేవాలయాల హుండీ లెక్కింపును గురువారం చంద్రావతి కల్యాణ మండపంలో చేపట్టారు. భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ. 2,58,56,737 ఆదాయం సమకూరినట్లు ఇన్‌ఛార్జి ఈవో ఇ.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

భావితరం.. గజగజ

■ విద్యార్థులకు అందని దుప్పట్లు
■ వసతిలో కొరవడిన సౌకర్యాలు







తొలి మంచు 'తెర'తీసింది.. చలి గాలుల తీవ్రత పెరిగింది.. రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి.. వణుకు మొదలైంది.. వసతి గృహాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.. గత ఐదేళ్లలో వైకాపా పట్టించుకోలేదు.. వసతి గృహాల భవనాలు అధ్వానంగా మారాయి.. తలుపులకు రంధ్రాలు పడ్డాయి.. కిటికీలకు తలుపులు లేవు.. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు.. భావితరం చలికి వణుకుతోంది.. దోమలు బాలల రక్తం తాగుతున్నాయి.. అధికారులు స్పందించి చలి తీవ్రత పెరగక ముందే దుప్పట్లు అందజేయాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే :

నంద్యాల రైతునగరం : నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలోని ఎస్సీ వసతిగృహంలో 110 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. హాస్టల్ భవనం కిటికీల అద్దాలు పగిలిపోయాయి. కొన్నింటికి తలుపులు లేవు. దీంతో చలిగాలి నుంచి రక్షణ కోసం విద్యార్థులు దుప్పట్లు అడ్డుగా కట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు.

డోన్‌పట్టణం: బీసీ బాలుర వసతిగృహంలో 175 మంది విద్యార్థులున్నారు. ఆరు గదుల్లో పెట్టెల మధ్య ఇరుకు...ఇరుకుగా విద్యార్థులు నిద్రిస్తున్నారు. ఒక్కో గదిలో 40 మంది వరకు ఉంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వలేదు.



ఒక్కరికీ ఇవ్వలేదు

విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 212 వసతి గృహాలకు ఇంతవరకు దుప్పట్లు సరఫరా చేయలేదు. చలి నుంచి రక్షణ కల్పించే రగ్గులు ఇవ్వలేదు.. విద్యార్థులంతా నేలపైనే నిద్రిస్తున్నారు.. కొందరు ఇంటి నుంచి తెచ్చుకున్న వాటితో రక్షణ పొందుతున్నారు. మరికొందరు ఇద్దరు, ముగ్గురు కలిపి ఒకే దుప్పటి కప్పుకొంటున్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ కళాశాల బాలుర వసతిగృహంలో 40 మంది ఉంటున్నారు. వీరికి దుప్పట్లు పంపిణీ చేసినా బెడ్‌షీట్లు ఇవ్వలేదు. కిటికీలకు తలుపులు సరిగా లేవు. వాటికి ఏర్పాటు చేసిన జాలీలు చిరిగిపోయాయి. చలి, దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.



సున్నిపెంటలోని గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో 156 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వసతి భవనం కిటికీలకు తలుపులు దెబ్బతిన్నాయి. వాటికి జాలీలు లేవు. దీంతో చలి, దోమల బెడదతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

సున్నిపెంట సర్కిల్ :

దాతలు దయతలిస్తేనే

శీతాకాలం ప్రారంభమైంది.. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు గజగజ వణికిపోతున్నారు. వీరికి ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వలేదు.. కొందరు ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకున్నారు.. మరికొందరు చేసేది లేక నేలపైనే నిద్రిస్తున్నారు. చలితో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తున్నారు.. విద్యార్థులకు దాతలు చేయూత ఇస్తే బాగుంటుంది.

సాంఘిక 'సంక్షేమం' మరిచారు

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కర్నూలు జిల్లాలో 68, నంద్యాల జిల్లాలో 38 ఉన్నాయి. వీటిలో 7,905 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ వసతిగృహాల్లో కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కచోట కూడా పూర్తిస్థాయిలో వసతులు లేవు. కిటికీలు, తలుపులు సరిగ్గా లేవు. దీనికితోడు దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు.

నాలుగేళ్లుగా బాలికల అవస్థ

ఉమ్మడి జిల్లాలోని 53 కస్తూర్బా విద్యాలయాలకు నాలుగేళ్లుగా దుప్పట్లు పంపిణీ చేయలేదు. గత వైకాపా ప్రభుత్వం కేజీబీవీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నాలుగేళ్లుగా వేలాదిమంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేజీబీవీలు చాలా వరకు మండల కేంద్రాలు, పట్టణాలకు దూరంగా ఉండటంతో చలి తీవ్రతకు విద్యార్థినులు వణికిపోతున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని కస్తూర్బా విద్యాలయాల్లో ఎక్కడా సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయలేదు.

11,464 మంది ఇక్కట్లు

కర్నూలు జిల్లాలో 31 బీసీ వసతిగృహాలు, నంద్యాలలో 34 ఉన్నాయి. వీటిలో 11,464 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ వసతిగృహాల్లోనే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇంతవరకు దుప్పట్లు పంపిణీ చేయకపోవడం గమనార్హం.

జిల్లా విద్యాశాఖాధికారిగా పి.జనార్దన్‌రెడ్డి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా పి.జనార్దన్‌రెడ్డి నియమితులయ్యారు. కర్నూలు డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకునిగా పనిచేస్తున్న ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం డీఈవోగా నియమించారు. ప్రస్తుతం ఇక్కడ డీఈవోగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి 2023 జూన్ 14న విధుల్లో చేరారు. డోన్ డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ 16 నెలల కిందట డీఈవోగా నియమించారు.



పి.జనార్దన్‌రెడ్డి




వక్కిలేరు వంతెనపై ఉరితాడు!

ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని వక్కిలేరు వంతెనపై విద్యుత్తు స్తంభానికి తాడు కట్టి ఏడాదవుతోంది. తాడు తెగితే ఆదారిన వెళ్లే వారి ప్రాణాలు గోవిందా..! అంటూ పలువురు ఆందోళన చెందుతున్నారు. వంగిన స్తంభాన్ని సరిచేయాల్సింది పోయి..తాడు కట్టడమేమిటని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

అరుదైన బడికి అధోగతి

■ రూ.15 కోట్ల విలువైన భూమి కొట్టేశారు ■ వైకాపా నాయకుల భూదాహం



ఈనాడు, కర్నూలు, నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల మండలం కానాలలో 'శ్రీ పోశం పాపిరెడ్డి పూదోట సంస్కృతోన్నత పాఠశాల' రాష్ట్రంలో ఉన్న అతికొద్ది సంస్కృత పాఠశాలల్లో అదొకటి.. సంస్కృత భాషపై ఆసక్తి ఉండేవారికి వీలుగా పోశం పాపిరెడ్డి స్థాపించారు.. ఆయన పాఠశాలకు రాసిచ్చిన భూములపై కొందరు కన్నేశారు.. పాఠశాలను మూతపడేలా చేశారు.. పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న వైకాపా నేత జగదీశ్వరరెడ్డి పేరు ఆన్‌లైన్లో కనిపించడం చర్చనీయాంశంగా మారింది.. రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్లో పేరు నమోదు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఆ భూమి విలువ రూ.15 కోట్ల వరకు ఉంటుందని అంచనా. పాఠశాల అభివృద్ధికి వినియోగించాల్సిన ఆయా భూములపై వచ్చే ఆదాయం కొన్నేళ్ల నుంచి పరులపరమవుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బైలాస్ ప్రకారం ఆ సొసైటీ నిర్వహణ జరుగుతుందా ? లేదా ? అన్న విషయాన్ని సహకార శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

1958లో ఏర్పాటైన ఆ పాఠశాలకు ప్రభుత్వం ఎయిడెడ్ విద్యాసంస్థగా గుర్తింపునిచ్చింది. 11 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, నలుగురు సిబ్బందిని కేటాయించింది. విద్యాసంస్థ నిర్వహణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పాపిరెడ్డి ఒక సొసైటీని ఏర్పాటు చేసి దానికి కొన్ని బైలాస్

పాఠశాలకు 11.05 ఎకరాలు

ఖరారు చేసి 12.05 ఎకరాలు రాసిచ్చారు. 11.05 ఎకరాలు పాఠశాల పేరిట, ఒక ఎకరం భూమిని తన భార్య పేరిట ఉండేలా రిజిస్ట్రేషన్ చేశారు. సొసైటీ సభ్యుల్లో తన కుటుంబసభ్యులిద్దరికి శాశ్వత సభ్యత్వం కల్పించారు. రెండెకరాల విస్తీర్ణంలో పాఠశాల ఉండగా దానికి ఆనుకొనే పదెకరాల పొలం ఉంది. పొలంపై వచ్చే ఆదాయంతో ఆ పాఠశాలను నిర్వహించేవారు. ఒకప్పుడు వందల్లో ఉన్న పిల్లల సంఖ్య గతేడాది 35కు పడిపోయింది.. తక్కువ మంది పిల్లలున్నారన్న కారణంతో ఆ పాఠశాలలోని బోధన, బోధనేతర సిబ్బందిని వేరే పాఠశాలలకు పంపేశారు.

దస్త్రాల్లో పేరు మార్చారు

పాపిరెడ్డి దంపతులు చాలా కాలం కిందట మృతిచెందారు. వారికి సంతానం లేకపోవడం. . వారు దానం చేసిన భూములు పక్కదారి పట్టినా ప్రశ్నించేవారే కరవయ్యారు. పాఠశాల భూములు ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటం.. నీటి సదుపాయం ఉన్న భూమి కావడంతో రూ. కోట్లు పలుకుతోంది. దీంతో ఆ భూములపై కొందరు కన్నేశారు. సర్వే నంబరు 581-1లోని 12.05 ఎకరాల సొసైటీ భూములు ప్రభుత్వ వెబ్‌ల్యాండ్ దస్త్రాల్లో పాఠశాల పేరుతో పాటు ఎం.జగదీశ్వరరెడ్డి పేరు కూడా బ్రాకెట్లో కనిపిస్తుండటం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గతంలోని రెవెన్యూ రికార్డుల్లో 'ఓరియంటల్ హైస్కూల్ ప్లేగ్రౌండ్' పేరిట 11.05 ఎకరాలు, పాపిరెడ్డి సతీమణి పోశం లక్ష్మమ్మ పేరిట ఒక ఎకరం భూమి ఉన్నట్లు దస్త్రాల్లో ఉంది. తాజా దస్త్రాల్లో ఆమె మాయమైంది. మొత్తం భూమిని 12.05 ఎకరాలుగా మార్చి పాఠశాల పేరుతోపాటు జగదీశ్వరరెడ్డి పేరును దస్త్రాల్లో జతచేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.



కల్యాణి ఎస్టేట్‌లో కట్టడాలు

జాగాలో ఆక్రమణ జలగలు



పుర అధికారులు అతికించిన తాఖీదులు

నిఘావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ స్థలం కన్పిస్తే చాలు.. కబ్జా చేసేద్దామనుకునే వారి సంఖ్య డోన్‌పట్టణంలో ఎక్కువవుతోంది. పురపాలికలో స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాపట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు వైకాపా నాయకులు మున్సిపల్ లే అవుట్‌లోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు కట్టేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు.

79 సెంట్ల భూమి కేటాయింపు

డోన్ పట్టణంలో కల్యాణి ఎస్టేట్‌లో లే అవుట్ ద్వారా 380-ఎ1, 380-ఎ, 380-బి, 380- సి, లతో పాటు పలు సర్వే నంబర్లలో 79 సెంట్ల భూమిని మున్సిపాల్టీకి కేటాయించారు. రెండేళ్ల కిందట వరకు ఈ జాగా ఖాళీగానే ఉండేది. కొంతమంది ఆక్రమణదారుల కన్ను దీనిపై పడింది. దాదాపు 20 నుంచి 25 సెంట్ల వరకు రూ.కోటి విలువైన మున్సిపాల్టీ స్థలం కబ్జా చేసి బేస్‌మట్టాలు, లెంటల్ లెవల్ వరకు, నిర్మాణాలు చేపట్టారు.

పది మందికి తాఖీదులు

కట్టడాలు కట్టేసిన తర్వాత ఆలస్యంగా అధికారులు మేల్కొన్నారు. మూడు రోజుల కిందట ఆక్రమణదారులను గుర్తించి కొందరికి తాఖీదులు ఇచ్చారు. మరి కొందరికి సంబంధించి బేస్‌మట్టాలకు, ఇంటి గోడలకు అతికించారు. ఇలా పది మందికి ఇచ్చామని, మరో నలుగురికి ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టీసీ కాలనీలోని కల్యాణి లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లోని పార్కు స్థలంలో బేస్‌మెంట్ కట్టిన ఆక్రమణదారుడికి నోటీసు జారీ చేశారు. నోటీసు అందిన ఏడు రోజుల్లో తొలగించాలని పేర్కొన్నారు.

సమాధానం వచ్చిన తర్వాతే చర్యలు

–పి.శబరీష్, టీపీఎస్, డోన్

మున్సిపాల్టీ స్థలం ఆక్రమించినట్లు తెలిసి తాఖీదులు జారీ చేశాం. వారు పట్టాలు ఇచ్చారని చెబుతున్నారు. దానిపై క్లియరెన్స్ కోసం రెవెన్యూ కార్యాలయానికి లేఖ రాశాం. దీని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

పర్యాటకంలో మాజీల పెత్తనం

■ పర్యాటక డీవీఎంకు మాజీ ఎమ్మెల్యేల మద్దతు
■ గడువు ముగిసినా కొనసాగింపు
■ అడ్డగోలుగా క్రీడా సమాఖ్య కార్యదర్శి తొలగింపు



ఈనాడు, కర్నూలు: వైకాపా అధికారం కోల్పోయి తెదేపా అధికారంలోకి వచ్చినా వైకాపా మాజీ ఎమ్మెల్యేల హవా ఉమ్మడి జిల్లాలోని పలుశాఖల్లో కొనసాగుతోంది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి సన్నిహిత బంధువైన చంద్రమౌళీరెడ్డి కర్నూలు జిల్లా పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజినల్ మేనేజర్‌గా గడువుతీరినా ఇంకా కొనసాగుతుండటంపై చర్చ జరుగుతోంది. వైకాపా హయాంలో విజయవాడలోని పర్యాటకశాఖలో సహాయ సంచాలకునిగా ఉన్న ఆయన్ని అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సిఫార్సుతో కర్నూలు జిల్లా డీవీఎంగా పోస్టింగు పొందారు. అప్పటి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే జె.సుధాకర్‌ల మద్దతుతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీకి లేఖలు రాయడంతో చంద్రమౌళీరెడ్డిని ఏడాది పాటు డిప్యుటేషన్‌పై పంపించారు. ఈ గడువు తీరినా మళ్లీ వైకాపా పెద్దలతో సిఫార్సు చేయించి మరో ఏడాది డిప్యుటేషన్‌ను పొడిగించారు. అది కూడా ఈనెల 19వ తేదీతో పూర్తయినా ఆయన కొనసాగుతుండటంపై చర్చ జరుగుతోంది.


సిద్ధార్థరెడ్డి సన్నిహితుడికి పదవి....

శాప్ ఛైర్మన్‌గా గతంలో ఉన్న సిద్ధార్థరెడ్డికి, పలువురు వైకాపా నాయకులకు సన్నిహితుడైన పాఠశాల సహాయకుడు శ్రీనాథ్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయన నియామకం విరుద్ధమని స్కూల్ అసిస్టెంట్ శివకుమార్ అప్పటి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తాను అర్హుడినైనా నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగు ఇవ్వడంతో అన్యాయం జరిగిందని పోరాడటంతో శివకుమార్‌ను పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమించారు. శివకుమార్ హయాంలో రాష్ట్రస్థాయిలో 12 బంగారు, ఏడు రజత, 9 కాంస్య పతకాలు వచ్చాయి. గతంలో కాకినాడలో ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో రూ.లక్షల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తగా, మండల క్రీడా సమన్వయకర్తలకు నిధుల పంపిణీలో ఆలస్యం జరిగిందనే కారణం చూపి శివకుమార్‌పై విచారణ జరిపారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా ఈనెల 17న అర్ధంతరంగా పదవి నుంచి తొలగించారు. ఆయన్ను పక్కన పెట్టి మళ్లీ శ్రీనాథ్‌ను అదేరోజు ఏకపక్షంగా అడ్డగోలుగా నియమించడంపై చర్చ జరుగుతోంది.

చీకటి జీవోలతో శ్రీశైలంలో చిక్కులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రానికి సంబంధించి గత వైకాపా ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీవోలతో చిక్కులు ఎదురవుతున్నాయి. క్షేత్రంలో సత్రాల ఏర్పాటుకు స్థలాలు మంజూరు చేస్తూ అప్పటి దేవాదాయశాఖ మంత్రి జారీ చేసిన జీవోలను ఏపీజీవోఐఆర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదు. శ్రీశైలంలో సాధారణంగా ఒక సామాజిక వర్గానికి ఒక సత్రం మాత్రమే కేటాయిస్తారు. విజయవాడకు చెందిన వైకాపా మాజీ మంత్రి ఒకరు తన సామాజిక వర్గానికి సంబంధించిన సత్రం కోసం 50 సెంట్లు మంజూరు చేయించుకున్నారు. ఈ సామాజిక వర్గానికి ఇప్పటికే ఇక్కడ మూడు సత్రాలు ఉండటం గమనార్హం. దీంతో పాటు మరో రెండు సత్రాలకు కూడా స్థలాలు కేటాయిస్తూ జీవోలు జారీ చేశారు. దేవస్థానం భవిష్యత్తు అవసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని ఇష్టానుసారం సత్రాలకు కేటాయించడంతో పాటు కాటేజీల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. దీంతో మిగతా సామాజిక వర్గాల నుంచి సైతం తమకూ అదనంగా స్థలం కేటాయించాలని డిమాండ్లు వస్తున్నాయి. సర్వీసు వ్యవహారాలకు సంబంధించి కూడా అప్పటి మంత్రి కొట్టు సత్యనారాయణ చీకటి జీవోలు జారీ చేయడం ప్రస్తుతం దేవస్థానాల్లో సమస్యలు తెచ్చిపెడుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో జారీచేసిన చీకటి జీవోలపై దృష్టి పెట్టిన నేపథ్యంలో దేవాదాయశాఖలో చోటుచేసుకున్న వ్యవహారాలపై కూడా విచారణ జరిపించాలని భక్తులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రికి రూ.4.10 లక్షల అందజేత



సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కులు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వరద బాధితుల సహాయార్థం దాతలు అందజేసిన రూ.4.10 లక్షల విలువైన చెక్కులను రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన సీఎంను కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ప్రజలు అందజేసిన విరాళాలను ఐదు విడతల్లో సీఎంకు ఇచ్చినట్లు వివరించారు.

తెదేపా నేత ఏవీ.సుబ్బారెడ్డి ఆరోపణపై వివరాలు ఇవ్వండి

☛ పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఆళ్లగడ్డ పట్టణాన్ని విడిచి వెళ్లాలంటూ డీఎస్పీ తనను మౌఖికంగా వేధిస్తున్నారంటూ తెదేపా నేత ఏవీ.సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్.చక్రవర్తి గురువారం ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు. ఆళ్లగడ్డ విడిచి వెళ్లాలంటూ డీఎస్పీ ఒత్తిడి చేయకుండా నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. పోలీసుల వైఖరి తెలుసుకోకుండా ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు. అంతకు ముందు జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నగర బహిష్కరణ ఉత్తర్వులిచ్చే అధికారం కేవలం జిల్లా కలెక్టర్‌కు మాత్రమే ఉంటుందన్నారు. పిటిషనర్ విషయంలో జోక్యం చేసుకోకుండా డీఎస్పీని నిలువరించాలని కోరారు.

అహోబిలానికి రూ.3.25 కోట్ల జమ

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయం సొమ్ము రూ.3.25 కోట్లు ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లా నైమిశారణ్యం ఛారిటబుల్ ట్రస్టుకు మే నెలలో బదిలీ జరగడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై 'ఈనాడు'లో మే 15న కథనం ప్రచురితమైంది. ఇటీవల ఆ ట్రస్టు నుంచి తిరిగి అహోబిలం దేవస్థానానికి బదిలీ అయి ఖాతాకు ఆ నగదు జమైనట్లు మఠం మేనేజర్ మాధవన్ తెలిపారు.

ఉల్లాస్‌ంగా.. ఉత్సాహంగా

◆ నిరక్షరాస్యుల్ని అక్షరాస్యులుగా మార్చేందుకు అడుగులు

◆ ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యపై అవగాహనకల్పనకు చర్యలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: 'ఉల్లాస్' (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పేరిట వందశాతం అక్షరాస్యత సాధించి ప్రజల్లో ప్రాథమిక, డిజిటల్, ఆర్థిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55వేల మందికి పైగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

15 ఏళ్లకుపైగా ఉన్న గ్రామీణవాసులు..

15 ఏళ్లకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా మార్చడమే 'ఉల్లాస్' లక్ష్యం. ప్రజల జీవన పరిస్థితులు మారిన నేపథ్యంలో ప్రతి అంశంలోనూ సాంకేతికత, డిజిటల్ విధానం, నగదు రహిత లావాదేవీలు, ముఖ్యంగా మహిళలు పొదుపు సంఘాల్లో ఉండేలా చూడటం, బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి వాటిని నిర్వహించడం వచ్చేలా అన్ని విధాలుగా తీర్చిదిద్దటం లక్ష్యం.. చదువు రాని వారు పత్రాలపై ఆధారపడుతున్న పరిస్థితులను అధిగమించేలా అందరిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసేందుకు పూర్తి అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో 15 ఏళ్ల దాటిన వారికి విద్యను అందించే వ్యవస్థ ఏదీ ప్రస్తుతం అందుబాటులో లేదు. అందుకే ప్రత్యామ్నాయంగా మరోమారు గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్యా కేంద్రాలను ప్రారంభించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా

అక్షరజ్ఞానం లేని వారిని గుర్తించేందుకు ఏపీ సెర్ప్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 28,872, నంద్యాల జిల్లాలో 26,785 మంది చదువురాని వారు ఉన్నట్లు గుర్తించారు. వారిలో తొలుత 18వేల మందిని ఎంపిక చేసి వారి వారి గ్రామాల్లోని అంగన్‌వాడీ, కమ్యూనిటీ కేంద్రాల్లో ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటలకు రెండు గంటల పాటు బోధన చేస్తారు. ఆరునెలల పాటు బోధించి వీరిని అక్షరాస్యులుగా మార్చిన తర్వాత మిగిలిన వారిని రెండు బృందాలుగా విభజించి చెరో ఆరు నెలల పాటు విద్యాబోధన చేస్తారు. 18 నెలల కాలంలో మొత్తం 55 వేల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించారు.



ఉల్లాస్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎవరు బోధిస్తారంటే..?

అంగన్‌వాడీ కేంద్రాలే వయోజన విద్యాకేంద్రాలుగా మారనుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలే బోధకులుగా మారనున్నారు. వారు అందుబాటులో లేకపోతే పొదుపు సంఘాల్లో, గ్రామంలో చదువుకున్న వారిని వాలంటీర్లుగా నియమిస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను సైతం వాలంటీర్లుగా నియమించే అవకాశం ఉన్నాయి. బోధించడం ఒక సేవా కార్యక్రమంగానే భావిస్తుండటంతో వాలంటీర్లకు ఎలాంటి జీతభత్యాలు ఇవ్వడంలేదు. బోధనకు సంబంధించిన విద్యా సామగ్రి త్వరలోనే అందుబాటులోకి రానుంది.

లాభాలు ఇలా...?

ఆర్థిక అక్షరాస్యత లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. విద్య లేకపోవడంతో ఆన్‌లైన్ మోసాలతో ఎక్కువగా నష్టపోతున్న వారిలో నిరక్షరాస్యులే ఎక్కువ. చదువుకోవడం ద్వారా సులభంగా ఆర్థిక లావాదేవీలు, ఇ-వాలెట్లు, ఆన్‌లైన్ చెల్లింపులు, రుణాలకు దరఖాస్తు చేసుకోవడం, వాటిని చెల్లించడం, ఆర్థిక పథకాలపై అవగాహన పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. విషయ పరిజ్ఞానం, సమాచార మార్పిడి, పొదుపు సంఘాల ఆర్థిక నిర్వహణ సులభమవుతుంది.

అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి -ప్రతాప్, ఏపీవో, వయోజన విద్య, కర్నూలు

'ఉల్లాస్' పథకాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. వాలంటీర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నాం. ఒక్కో వాలంటీరు 10 మందికి చదువు చెబుతారు. ఒక్కో బృందానికి ఆరు నెలల పాటు చదువు చెప్పి అక్షరాస్యులుగా మారుస్తాం.

ఇక్కడి నుంచి కదలం సీట్లు వదలం

◆ ఏళ్లుగా తిష్టేసిన పీఆర్ ఇంజినీర్లు

◆ వైకాపాకు అనుకూలమైన వారికి మళ్లీ కీలక స్థానాలు



కర్నూలు నగరం, న్యూస్‌టుడే : పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో పలువురు అధికారులు ఏళ్ల తరబడి ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే తిష్టేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లోనూ చక్రం తిప్పారు. తమకు అవసరమైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని నేతల సిఫార్సులతో చేరిపోయారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 95 ఏఈఈ, 12 డీఈఈ, మూడు ఈఈ, రెండు ఎస్ఈ పోస్టులున్నాయి. ఇందులో అధిక శాతం మంది డీఈఈలు, ఏఈఈలు ఉమ్మడి జిల్లాలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఒక మండలం నుంచి మరో మండలానికి నేతల ఆశీస్సులతో బదిలీలు చేయించుకుంటూ అక్కడే స్థిరపడిపోవడం గమనార్హం.

ఆ ప్రాంతాలకే పోటీ

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌లో పీఐయూ, పీఆర్ఐ విభాగాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం పీఎంజీఎస్‌వై, ఏఐఐబీ కింద పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ ఉంటుంది. ఈ నిధులతో రహదారులు, భారీ వంతెనల నిర్మాణ పనులు పీఐయూ ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి విడుదలయ్యే నిధులతో రహదారులు, సచివాలయాల నిర్మాణాలు తదితరాలను పీఆర్ఐ విభాగంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో పనులు జరిగే ప్రాంతాల్లో విధులు నిర్వహించేందుకు పలువురు పోటీ పడుతూ ఉంటారు.

గత ప్రభుత్వంలో చక్రం తిప్పి..

● పంచాయతీరాజ్ డీఈఈ మహేశ్వరరెడ్డి 2019 నుంచి 2024 వరకు కోడుమూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేసి ప్రస్తుతం తిరిగి కోడుమూరు పీఐయూ డీఈఈగా చేరారు. ఆయన గతంలో పదేళ్లపాటు వైద్య, ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్‌పై పనిచేశారు. గతంలో వైకాపాకు అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. అయినప్పటికీ ఆయనకు కోడుమూరు డీఈఈగా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోనే గత 15 ఏళ్లకు పైగా కొనసాగుతుండటం గమనార్హం.

● డోన్ డీఈఈగా పనిచేసిన నాగిరెడ్డికి తిరిగి కర్నూలులో పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ప్రస్తుతం పాణ్యం పీఆర్ఐ డీఈఈగా బాధ్యతలు చేపట్టారు. 2019-24 వరకు అయిదేళ్లపాటు మంత్రి ఇలాకాలో రూ.కోట్ల విలువైన పనులు జరిగాయి. వైకాపా వ్యక్తిగా ముద్ర వేసుకున్న డీఈఈకి మళ్లీ కర్నూలులో ఎలా పోస్టింగ్ ఇచ్చారన్న విషయమై చర్చ సాగుతోంది.

అక్కడికక్కడే బదిలీలు చేయించుకుంటూ..

● పత్తికొండ డీఈఈ శేషయ్య ఏఈఈ స్థాయి నుంచి జిల్లాలో 16 ఏళ్లగా కొనసాగుతున్నారు. డోన్‌లో విధులు నిర్వహించి డీఈఈగా పదోన్నతి పొంది ఆరేళ్లు అక్కడే పనిచేశారు. ఎన్నికల ముందు మొక్కుబడిగా మరో జిల్లాలో విజిలెన్స్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తిరిగి పత్తికొండ వచ్చారు.

● పీఆర్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఈరన్న ఆరేళ్లుగా ఆదోని (కర్నూలు కేంద్రంగా)లో పనిచేస్తున్నారు. ఆయన గతంలో కర్నూలు డ్వామాలో అదనపు పీడీగా పనిచేసి క్వాలిటీ కంట్రోల్‌కు వచ్చి స్థిరపడిపోయారు. నిబంధనల మేరకు క్వాలిటీ కంట్రోల్‌లో మూడేళ్ల సర్వీసు దాటితే బదిలీ చేయాల్సి ఉంది. కానీ పీఆర్ ఇంజినీర్ల సంఘం పేరుతో ఇక్కడే కొనసాగుతున్నారు.

● పీఆర్‌లో మరో ఇద్దరు ఏఈఈలు కీలకంగా వ్యవహరిస్తూ చక్రం తిప్పుతున్నారు.. మొన్నటివరకు కర్నూలు ఏఈఈగా ఉన్న రవిమోహన్‌రెడ్డి ఇటీవల జరిగిన బదిలీల్లో కల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ కావడం లేదు. కర్నూలు, కల్లూరు మండలాల్లోనే 20 ఏళ్లగా కొనసాగుతున్నారు.

● ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తూ పీఆర్‌కు బదిలీ అయిన ఏఈఈ ముక్తార్‌బాషా గత 22 ఏళ్లుగా కర్నూలులో తిష్టేశారు. అసోసియేషన్ పేరుతో కొందరు ఇంజినీర్ల బదిలీల్లో జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

● మంత్రాలయం డీఈఈ అశ్వర్థామ గత 15 ఏళ్లుగా మంత్రాలయం, ఆదోని సబ్ డివిజన్లకే పరిమితమయ్యారు. జిల్లాను విడిచి వెళ్లడం లేదు. మరో డీఈఈ రంగస్వామి సైతం ఆదోని, మంత్రాలయంలోనే ప్రాంతాల్లోనే ఉంటున్నారు.

● నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న డీఈఈలు నాగశ్రీనివాసులు, మన్మథబాబు, మురహరి గత 25 ఏళ్లుగ్గా అక్కడికక్కడే బదిలీలు చేయించుకుంటూ కొనసాగుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలతో పైరవీలు చేయించుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

2 నుంచి మహానందిలో కార్తిక మాసోత్సవాలు

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రంలో నవంబరు 2 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేవస్థానం ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆలయాన్ని తెల్లవారుజామున 3 గంటలకు తెరిచి సుప్రభాతం, స్థానికాభిషేకం నిర్వహిస్తామన్నారు. 3.30 గంటలకు మహామంగళ హారతులు ఇస్తామన్నారు. శని, ఆది, సోమవారాల్లో వేకువజామున 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, మిగతా రోజుల్లో ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు స్వామివారి దర్శనం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వేకువజామున 4 గంటలకే కోనేర్లలోకి అనుమతిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో రూ.2 వేల పరోక్ష సేవల టికెట్ బుక్ చేసుకున్న వారి పేరున పూజలు చేస్తామన్నారు. ఈ దాతలు నెలలో ఎప్పుడు దర్శనానికి వచ్చినా స్వామివారికి క్షీరాభిషేకం చేయించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. నవంబరు 15న కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని రాత్రి జ్వాలాతోరణం, కోటి దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాస శివరాత్రి సందర్భంగా 29న లక్ష బిళ్వార్చన, 30న లక్ష కుంకుమార్చన, అదేరోజు రాత్రి 6.30 గంటల నుంచి స్వామివారి కల్యాణం జరిపిస్తామని వివరించారు. మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నిర్మించిన డార్మెటరీలో భక్తులకు ఉచితంగా వసతి కల్పిస్తామన్నారు. సమావేశంలో ఆలయ ఏఈవో ఎర్రమల మధు, ప్రధానార్చకుడు మామిళ్లపల్లె అర్జునశర్మ, ఉప ప్రధానార్చకుడు వనిపెంట జనార్దన్‌శర్మ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

శ్రీశైలంలో వృద్ధుల ఇక్కట్లు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో ఆలయ క్యూలైన్ల వద్ద వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడకు చెందిన బేబీ సరోజిని తన కూతురుతో కలిసి ఈనెల 3న శ్రీశైలం వచ్చారు. ఆ సమయంలో దసరా మహోత్సవాలు జరుగుతుండటంతో వేడుకలను తిలకించేందుకు ఆలయ క్యూలైన్ల వద్దకు వెళ్లామన్నారు. తమను ఆలయంలోకి అనుమతించకుండా క్యూలైన్ల పర్యవేక్షకురాలు హిమబిందు ఇబ్బంది పెట్టినట్లు వాపోయారు. తాను నడవలేని స్థితిలో ఉన్నానని, వాయుసేన విశ్రాంత ఉద్యోగి భార్యనని చెప్పి బతిమాలినా టిక్కెట్ క్యూలైన్ల నుంచి రావాల్సిందే అని చెప్పారని తెలిపారు. దగ్గరి నుంచి దర్శనానికి వెళ్లాలంటే రూ.500 టిక్కెట్లు తీసుకోవాలని సలహా ఇచ్చారన్నారు. వృద్ధులు, దివ్యాంగుల పట్ల కనికరం చూపకుండా ప్రవర్తించిన ఇటువంటి అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె దేవస్థానం ఈవోకు లేఖ రాశారు. శ్రీశైలం దర్శనానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఈవో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు గురువారం వాట్సప్ ద్వారా విలేకరులకు సమాచారం ఇచ్చారు.



దర్శనానికి ఇబ్బందులు పడినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్న బేబీ సరోజిని

మహానందీశునికి రూ.2 కోట్ల ఆస్తి సమర్పణ

మహానంది, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామికి విశ్రాంత అధ్యాపకుడు రాజు దంపతులు రూ.2 కోట్లకు పైగా విలువచేసే ఆస్తులు రాసిచ్చారు. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు డి.రాజు, శకుంతల దంపతులు గురువారం ఆలయాన్ని సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం 2.10 ఎకరాల సాగు భూమి, గ్రామంలో నివాస గృహంతో కూడిన ఐదు సెంట్ల స్థలానికి సంబంధించిన హక్కు పత్రాలను దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధులకు అందజేశారు. దాతలను అధికారులు సత్కరించారు. మూడేళ్ల కిందట కూడా రాజు దంపతులు 2.25 ఎకరాల భూమిని మహానందీశునికి సమర్పించారని, ప్రస్తుతం దాని విలువ రూ.3 కోట్లు ఉంటుందని ఆలయ సిబ్బంది తెలిపారు.



ఈవోకు ఆస్తి హక్కుపత్రాలు అందజేస్తున్న దాతలు డి.రాజు, శకుంతల

మీర్జాపురంలో పాఠశాల స్థలం ఆక్రమణ

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురైంది. స్థానిక వైకాపా నాయకుడు ఈ స్థలాన్ని ఆక్రమించి దర్జాగా ఇల్లు కట్టేశారు. 1978లో అప్పటి సర్పంచి గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 96, 97లలోని 50 సెంట్ల ప్రభుత్వ భూమిని పాఠశాలకు కేటాయించారు. ప్రభుత్వ నిధులు వెచ్చించి గదులు ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు ఒకరు పాఠశాల స్థలంపై కన్నేశారు. వైకాపా ప్రభుత్వంలో స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు ఆపేశారు. మూడున్నర సెంట్ల స్థలం వరకు ఆక్రమించేశారని, దీని విలువ రూ.లక్ష వరకు ఉంటుంది. దీనిపై మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా... రెండు రోజుల్లో గ్రామానికి వెళ్లి పాఠశాల దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకొంటామన్నారు.



పాఠశాల స్థలంలో ఇల్లు కట్టుకొన్న వైకాపా నాయకుడు

ఉచిత ప్రయాణం హామీ అమలు చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని నూనెపల్లె వంతెన నుంచి కంబలూరు వెళ్లే ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులో గురువారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రయాణిస్తూ మహిళలతో మాట్లాడారు. ఉచిత ప్రయాణం హామీ అమలు చేయాలంటూ మహిళలతో ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు రాయించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ మాట్లాడుతూ.. మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాలుగు నెలలు దాటినా ఉచిత బస్సు ప్రయాణం కల్పించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకే పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ నాయకులు చింతలయ్య, జయలక్ష్మి, హుసేన్‌బాషా, సయ్యద్ ఇస్మాయిల్, ఇబ్రహీం పాల్గొన్నారు.




మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

ఆటో ఢీకొని ఒకరి మృతి

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు-కోవెలకుంట్ల ఎనిమిది గాళ్ల మోరీ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారని పోలీసులు వివరాలు తెలిపారు. ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లెకు చెందిన గై భూసా(56) మరో వ్యక్తితో కలసి కోవెలకుంట్ల నుంచి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, దొర్నిపాడు మండలంలోని ఎనిమిది గాళ్ల మోరి వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొందన్నారు. గై భూసాకు తీవ్రగాయాలవ్వడంతో మెరుగైన చికిత్సకు 108 వాహనంలో నంద్యాల తీసుకెళ్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

పంటనూర్పిడి యంత్రంలో పడి కూలీ మృతి

సంజామల, న్యూస్‌టుడే: పంట నూర్పిడి యంత్రంలో పడి కూలీ మృతి చెందిన ఘటన ముదిగేడులో జరిగిందని గురువారం గ్రామస్థులు చెప్పారు. గ్రామానికి చెందిన పి.పెద్ద అలీఖాన్ (54) ఇదే గ్రామానికి చెందిన విజయభాస్కర్ పొలంలో మినుము నూర్పిడి పనికి వెళ్లారు. నూర్పిడి యంత్రంలో చిక్కుకుని అందులోనే ప్రాణాలొదిలారు. మృతుడికి భార్య హుసేన్‌బీ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందారని బాధిత సభ్యుల రోదన అందర్నీ కలచివేస్తోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పసుపల పెద్ద అలీఖాన్ (పాత చిత్రం)

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

అలగనూరు జలాశయం పరిశీలన

మిడుతూరు, న్యూస్‌టుడే : మండలంలోని అలగనూరు జలాశయాన్ని కలెక్టర్ రాజకుమారి గురువారం పరిశీలించారు. కుంగిన జలాశయం కట్టకు రూ.34 కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు కేసీ కాలువ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కట్ట కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈఈ ప్రతాప్, డీఈ రామ్మోహన్ జలాశయం నిర్మాణ ప్రాధాన్యం, వివరాలను ఆమెకు వివరించారు. అనంతరం కలెక్టర్ రోళ్లపాడు బట్టమేక పక్షి అభయారణ్యాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, నీటి పారుదల శాఖ ఏఈలు పాల్గొన్నారు.


జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

రీసర్వే సమస్యలు పరిష్కరిస్తాం

చాబోలు (నంద్యాల గ్రామీణం), న్యూస్‌టుడే : రీసర్వేలో తలెత్తిన సమస్యలను రైతులు రెవెన్యూ గ్రామసభలో అధికారుల దృష్టికి తెస్తే 15 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దారు ప్రియదర్శిని చెప్పారు. మండలంలోని చాబోలు గ్రామంలో సర్పంచి మౌనిక ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 106 దరఖాస్తులు వచ్చినట్లు రీసర్వే డీటీ నాగరాజు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

కొత్తపల్లి : **సమస్య :** పెద్దగుమ్మడాపురంలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. **- లక్ష్మన్న, స్థానికుడు**
సమాధానం : వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- విజయ్‌కుమార్, సర్పంచి**
సమస్య : ఎర్రమఠం రోడ్డు అధ్వానంగా ఉంది. **- లింగన్న**
సమాధానం : సీసీ రహదారి నిర్మాణానికి కృషిచేస్తాం. **- బాల ఎల్లయ్య, సర్పంచి**

విద్యార్థికి వణుకు.. యంత్రాంగం కునుకు

☛ చలి పెరుగుతున్నా రక్షణ చర్యలు కరవు
☛ వసతిగృహాల్లో వేధిస్తున్న సమస్యలు

ప్రాంతం | వసతిగృహం | విద్యార్థుల సంఖ్య | సమస్యలు

ఆరుబయట చన్నీటి స్నానం

దేవనగర్, నంద్యాల
ఎస్సీ బాలుర ప్రీమెట్రిక్ హాస్టల్
110 మంది



మరుగుదొడ్లన్నీ పాడయ్యాయి. మరుగుదొడ్లు, బాత్రూంల తలుపులు విరిగిపోయాయి. ఉదయాన్నే విద్యార్థులు ఆరుబయటే చన్నీటి స్నానం చేయాల్సి వస్తోంది. దీంతో తరచూ జలుబు, జ్వరాల బారినపడుతున్నారు.

వరండాలోనే నిద్ర

సాయిబాబానగర్, నంద్యాల
బీసీ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహం
120 మంది



విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదుల్లేవు. దీంతో చాలామంది వరండాలోనే నిద్రించాల్సి వస్తోంది. కొన్ని కిటికీల అద్దాలు పగిలిపోయాయి. కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉంది.

కిటికీలకు తెరలు కట్టుకుని..

బొమ్మలసత్రం, నంద్యాల
ఎస్సీ బాలుర వసతిగృహాలు
210 మంది



ఇక్కడున్న రెండు వసతిగృహాల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. కొన్నింటికి తలుపులు ఊడిపోయాయి. దీంతో విద్యార్థులు రాత్రిళ్లు చలికి వణుకుతున్నారు. తలుపుల్లేని కిటికీల నుంచి చల్లగాలి, దోమలు రాకుండా అట్టలు, దుప్పట్లు అడ్డుగా పెట్టుకున్నారు. మరుగుదొడ్లు పాడవ్వడంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్లాల్సి వస్తోంది.

సమస్యల సమీకృతం

ఆత్మకూరు
సమీకృత వసతి గృహం
66 మంది


సమీకృత వసతిగృహంలో కుంగిన బండలు

2007లో రూ.1.70 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. కింది అంతస్తు మాత్రమే పూర్తిచేసి విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. పైఅంతస్తు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పనులు నాసిరకంగా చేయడంతో ఫ్లోరింగ్ కుంగిపోయింది. బండలు చెదిరిపోయి నడవలేని పరిస్థితి నెలకొంది. మెట్లపై కూడా బండలు ఊడిపోయాయి. వీటి వల్ల పిల్లలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. 8 గదులకు గాను 4 గదుల్లో బండలు కుంగడంతో వాటికి తాళాలు వేశారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు 20 ఉండగా పది ఉపయోగంలో లేవు. మిగతా వాటికి కూడా తలుపులు దెబ్బతిన్నాయి. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. ప్రభుత్వ కళాశాల వసతిగృహంలో కిటికీల తలుపులు, మెస్‌లు దెబ్బతిన్నాయి.


కిటికీలకు చిరిగిన మెష్‌లు

సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. శిథిల భవనాలు, ఇరుకు గదులు, అపరిశుభ్ర పరిసరాల్లో అవస్థలు పడుతున్నారు. కిటికీలకు తలుపుల్లేక.. దుప్పట్లు ఇవ్వక.. చలికి వణుకుతున్నారు. దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలికాలం మొదలవుతోంది. ఇప్పటికే రాత్రిళ్లు చలి తీవ్రత పెరిగింది. వసతి గృహాల కిటికీలు, తలుపులు దెబ్బతినడంతో విద్యార్థులు వణుకుతున్నారు. అధికారులు ఇప్పుడే స్పందించి హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించి.. చలిగాలి లోనికి ప్రవేశించకుండా మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం, ఆత్మకూరు, నందికొట్కూరు

దుప్పట్లు ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిందే..

నందికొట్కూరు
బీసీ వసతి గృహం
89 మంది



కాస్మొటిక్స్, దుప్పట్లు ఇవ్వలేదని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో ఇంటి నుంచి దుప్పట్లు తెచ్చుకున్నారు. సరిపడా మంచాలు లేక ఒకే మంచంపై ఇద్దరు చొప్పున పడుకుంటున్నారు.

కప్పుకోవడానికి దుప్పట్లు కరవు

విద్యా సంవత్సరం మొదలై ఐదు నెలలు గడుస్తున్నా బీసీ వసతిగృహాల్లోని విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేయలేదు. కనీస వసతులు కల్పించలేదు. ప్రభుత్వం నుంచి దుప్పట్లు అందకపోవడంతో కొందరు విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. మరికొందరు పిల్లలు దుప్పట్లు లేకుండానే నిద్రిస్తున్నారు. కిటికీలకు జాలీలు లేకపోవడం, దోమతెరలు ఇవ్వకపోవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. 7

పోలీసులపై తేనెటీగల దాడి

భైరాపురం (మిడుతూరు), న్యూస్‌టుడే : మండలంలోని భైరాపురం గ్రామంలో పోలీసులపై తేనెటీగలు దాడి చేశాయి. ఓ కేసు విచారణ నిమిత్తం ఓ కానిస్టేబుల్, ఒక హోంగార్డు గురువారం గ్రామానికి వెళ్లారు. విచారణ ముగించుకుని తిరిగి వెళుతుండగా దారిలో తేనెటీగలు చుట్టుముట్టాయి. కొన్ని తేనెటీగలు వారిని కుట్టడంతో వెంటనే మిడుతూరు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స తీసుకున్నారు.

లక్ష్యాల పేరుతో వేధిస్తున్నారు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : ఉన్నతాధికారులు ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు ఇచ్చి వేధిస్తున్నారని తపాలా శాఖ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పాణ్యం ఉప తపాలా కార్యాలయం వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. పోస్టుమాస్టర్ సుధీర్, పోస్టుమన్ శేఖర్, గ్రామీణ తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పనికి పిలవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ఆర్‌ఎల్‌ఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులను పాత పద్ధతిలోనే పనికి పిలవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ డిమాండ్ చేశారు. ఆర్‌ఎల్‌ఆర్‌ఎస్ ఎదురుగా జాతీయ రహదారిపై సీఐటీయూ నాయకులు, ఒప్పంద కార్మికులు గురువారం రాస్తారోకో నిర్వహించారు.

రాష్ట్ర సభ జయప్రదం చేయండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలో నవంబరు 5న జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర సభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం పీడీఎస్‌యూ 50 వసంతాల గోడపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు.

పశు పోషకులకు న్యాయం చేస్తాం

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : గాలేరి- నగరి కాల్వలో గేదెలు గల్లంతై నష్టపోయిన పశు పోషకులకు న్యాయం చేస్తామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్ చెప్పారు. మండలంలోని సుగాలిమెట్ట గ్రామంలో గురువారం ఆయన రైతులు, పశు పోషకులతో మాట్లాడారు. కాల్వలో జారిపడిన వాటిలో 15 గేదెలను బయటకు తీశారని, మరో ఏడింటి ఆచూకీ లభించలేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీహెచ్‌ఏ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.


పశు పోషకులతో మాట్లాడుతున్న పశు సంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్

పకడ్బందీగా అపార్ పత్రాల జారీ

గడివేముల, న్యూస్‌టుడే : విద్యార్థులకు అపార్ పత్రాల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. గడివేముల ఎంఈవో కార్యాలయంలో నిర్వహిస్తున్న అపార్ కార్యశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అపార్ విద్యార్థులకు విద్యా సంబంధమైన గుర్తింపు పత్రమని తెలిపారు. దీని ఆధారంగా విద్యార్థుల ధ్రువపత్రాలు భవిష్యత్తులో డిజీలాకర్ ద్వారా జారీ చేయనున్నట్లు వెల్లడించారు. అపార్ వివరాల నమోదులో తప్పుల్లేకుండా చూడాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించి ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో విమలావసుంధరాదేవి పాల్గొన్నారు.


అపార్ కార్యశాలను తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి

రక్తదానం చేసి ప్రాణాలు నిలపండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఎస్పీ రామాంజినాయక్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి రాయుడు ఆధ్వర్యంలో గురువారం పోలీసులు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సబ్ డివిజన్‌లోని ఆత్మకూరు, నందికొట్కూరు సర్కిళ్ల పరిధిలోని సీఐలు, ఎస్సైలు, పలువురు పోలీసులు, యువత 200 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐలు ఓబులేసు, సురేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సీఐలు ఓబులేసు, సురేశ్‌కుమార్‌రెడ్డి

క్విజ్ విజేతలకు బహుమతుల ప్రదానం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా చేతులమీదుగా గురువారం నగదు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక నవభారత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎస్.హుసేన్‌బాషా, ఎస్.అస్లాం, జె.నిఖిల్‌లతో పాటు మరో 21 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నవభారత్ పాఠశాల కరస్పాండెంట్ నవభారత్ హుస్సేన్, రహిమాన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సలాముల్లా, ఖాజా, ఇసాక్, హుసేన్‌బాషా, మున్నా, వహబ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ, నిర్వాహకులు

రైతులు బీమా ప్రీమియం చెల్లించేలా చూడండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రబీ సీజనులో భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద నామమాత్రం ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ జి.రాజకుమారి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని వ్యవసాయ శాఖ సంచాలకుల కార్యాలయం నుంచి ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం పంటల బీమా పథకం అమలుపై కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డిసెంబరు 15 నాటికి పంటల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విస్తరణ కరదీపికలు ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ అధికారి వైపీ మురళీకృష్ణ, క్లస్టర్ల ఏడీఏలు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం

బొల్లవరం (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం బొల్లవరం మెట్ట సమీపంలో గురువారం రాత్రి ఓ భారీ కొండచిలువ నంద్యాల- మహానంది ప్రధాన రహదారిని దాటుతూ కనిపించింది. దీంతో ఈ దారిలో ప్రయాణించే వారు భయాందోళనలకు గురయ్యారు. ఈ కారణంగా కాసేపు వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం వాహనదారులు శబ్దాలు చేస్తూ కొండచిలువ పొలాల్లోకి వెళ్లేలా చూశారు.

బీసీ వసతిగృహం తనిఖీ

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని బీసీ వసతిగృహాన్ని నందికొట్కూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాప్రియదర్శిని గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల గదులు, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారం మెనూ గురించి తెలుసుకున్నారు. వంటలను తనిఖీ చేశారు. వార్డెన్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాప్రియదర్శిని

హోంమంత్రి దృష్టికి సమస్యలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు నియోజకవర్గంలో శాంతి భద్రతల సమస్య, పోలీసుల క్వార్టర్స్ నిర్మాణం గురించి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. అమరావతిలో గురువారం హోంమంత్రిని ఆమె కార్యాలయంలో కలిసి సమస్యలపై చర్చించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పలచాని మహేశ్వరరెడ్డి, సర్వోత్తమరెడ్డి పాల్గొన్నారు.


హోంమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

ఆలోచనలకు పదును పెట్టారు.. విజేతలయ్యారు

నంద్యాల పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలోచనలకు పదునుపెట్టి వ్యాస రచనలో ప్రతిభ చూపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నాగజోషిక, మేధాదాస్, నిగ్రా తస్లీంలకు ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి, అకడమిక్ డీన్ ప్రసాద్, ఉపాధ్యాయులు ఇబ్రహీం ఖలీల్, పీఈటీ రిబెకా బహుమతులు అందించారు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్





ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలోని పద్మావతి ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అన్న అంశంపై వ్యాస రచన పోటీలు జరిగాయి. 8వ తరగతి విద్యార్థిని మేఘవర్షిణి, పదో తరగతి విద్యార్థిని ఎస్.కె.నాజియా, 8వ తరగతికి చెందిన సబీహా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల డైరెక్టర్ ఆశ, ప్రధానోపాధ్యాయులు సురేష్, ముర్తుజావలి బహుమతులు అందజేశారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. విద్యార్థులు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అన్న అంశంపై వ్యాసాలు రాశారు. 9వ తరగతికి చెందిన రాజేష్ ప్రథమ, పదో తరగతి విద్యార్థి గౌతమ్ ద్వితీయ, 9వ తరగతి విద్యార్థిని వర్షిత తృతీయ స్థానంలో నిలిచారు. వారికి కరస్పాండెంట్లు కెన్నడి, నిర్మలాకెన్నడి బహుమతులు అందజేసి అభినందించారు.



చలో విజయవాడ గోడపత్రాల విడుదల

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడాలని, కడప ఉక్కు కర్మాగారం నిర్మించాలంటూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబరు 1న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంఆర్ నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు.

వాలంటీర్లు మానేశారు.. పేర్లు తొలగించరు

నంద్యాల మండలం చాబోలు గ్రామంలో గత వైకాపా ప్రభుత్వంలో 23 మంది వాలంటీర్లు పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏప్రిల్ నెలలో వారిలో 22 మంది రాజీనామా చేశారు. వారి రాజీనామాలను అధికారులు ఆమోదించారు కూడా. ఆ 22 మంది గ్రామంలో వైకాపా అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేశారు. వారు రాజీనామా చేసి ఆరు నెలలు గడిచినా సరే సచివాలయంలోని బోర్డుపై వారి పేర్లు, చరవాణి నంబర్లు భద్రంగా ఉన్నాయి. ప్రభుత్వం మారి నాలుగు నెలలైనా బోర్డుపై పేర్లు తొలగించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే బోర్డుపై ఇటీవల బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి పేర్లను మాత్రం మార్చడం కొసమెరుపు. – న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం



జిల్లాను క్రీడల్లో అగ్రగామిగా నిలపాలి


కబడ్డీ ఆడుతున్న ఫిరోజ్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాను క్రీడల్లో అగ్రగామిగా నిలపాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ పోటీలు, నంది ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. రాష్ట్ర ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ భానుమూర్తిరాజుతో కలిసి ఫిరోజ్ ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి ఫిరోజ్ కబడ్డీ ఆడారు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా.రామకృష్ణారెడ్డి, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంఘం గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, రాష్ట్ర అధ్యక్షుడు ఏపీరెడ్డి, శాంతినికేతన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని పలు పాఠశాలల్లో 'ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై విద్యార్థులకు, 'సైబర్ నేరాలు నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై పోలీసు సిబ్బందికి వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని నిరసన

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంటలో ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ గురువారం పలువురు మహిళలు నిరసన తెలిపారు. స్థానిక భ్రమరాంబ థియేటర్ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు దుకాణదారులు ఏర్పాట్లు చేస్తుండటంతో స్థానిక మహిళలు అభ్యంతరం చెప్పారు. ఇళ్ల మధ్యలో మద్యం విక్రయిస్తే సమస్యలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గోస్పాడు, న్యూస్‌టుడే : బడులు, ఆలయాల సమీపంలో మద్యం దుకాణాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈమేరకు గోస్పాడు ఎస్సై వెంకటప్రసాద్‌కు సీపీఐ నాయకులు హరినాథ్, కార్యకర్తలు గురువారం వినతి పత్రం సమర్పించారు. సహాయ కార్యదర్శి జిలానీబాషా, చల్ల సుబ్బరాయుడు, రాముడు, సుబ్బుడు పాల్గొన్నారు.

నేలవాలిన వరి.. నష్టాల్లో హలధారి


వెలుగోడు సమీపంలో నేలవాలిన వరిపైరు

వెలుగోడు, న్యూస్‌టుడే : అల్పపీడన ప్రభావంతో పది రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. వెలుగోడు, బండిఆత్మకూరు మండలాల్లో వరిపంట విస్తారంగా సాగు చేశారు. భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పైరు నేలకొరిగింది. వెన్ను దశలో ఉన్న వరి నేలకొరిగి నీటితో తడవడం వల్ల దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

☛ ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో భారీ వర్షాలు కురిసి శ్రీశైలం జలాశయం నిండింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వెలుగోడు జలాశయానికి కృష్ణాజలాలు చేరాయి. దీంతో ఈ ప్రాంత రైతులు జులై, ఆగస్టు నెలల్లో వరినాట్లు వేశారు. ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడులు పెట్టారు.

☛ వెలుగోడు మండలంలోని బోయరేవుల, వెలుగోడు, మోతుకూరు, మాధవరం, అబ్దుల్లాపురం, అయ్యవారిపల్లె తదితర గ్రామాల్లో 3 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. బండిఆత్మకూరు మండలంలో కడమలకాల్వ, వెంగళరెడ్డిపేట, ఎ.కోడూరు, పార్నపల్లె, ఈర్నపాడు, శింగవరం, బండిఆత్మకూరు గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి వేశారు. ప్రస్తుతం వరిపంట వెన్ను దశలో ఉంది. సోమవారం బండిఆత్మకూరు, బుధవారం వెలుగోడు మండలంలో కురిసిన భారీ వర్షాలకు వందల ఎకరాల్లో పైనే నేలవాలింది. దీంతో ఎకరాకు పది బస్తాల దిగుబడులు తగ్గే ఆస్కారం ఉందని చెబుతున్నారు.

ఎకరాకు రూ.9-12 వేల అదనపు ఖర్చు

నేలకొరిగిన వరి పంటను రక్షించుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. పొలాల్లోని నీరు బయటికి వెళ్లేందుకు ఊట కాల్వలు తీస్తున్నారు. కూలీల సాయంలో కిందపడిన వరిపైరును కట్టలు కట్టిస్తున్నారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.300 కూలి ఇస్తున్నా కూలీలు దొరకడం లేదు. ఎకరాకు 20 నుంచి 30 మంది కూలీలు అవసరం అవుతున్నారు. నేలవాలిన పైరును కట్టలు కట్టడానికి ఎకరాకు రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

- సుధాకర్, వెలుగోడు

భారీ వర్షానికి వరిపైరు పూర్తిగా నేలవాలింది. దిగుబడి వస్తుందన్న నమ్మకం లేదు. వ్యవసాయాధికారులు పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలి. ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందేలా చూడాలి.

ఆళ్లగడ్డ
• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

కలుగొట్ల(కోవెలకుంట్ల గ్రామీణం): రేవనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డా.విద్యాసాగర్ ఆధ్వర్యంలో కలుగొట్లలోని ఎంపీయూపీ స్కూలు విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఐరన్ మాత్రలిచ్చారు.

యల్లావత్తుల(రుద్రవరం): యల్లావత్తుల, శ్రీరంగాపురం గ్రామ సచివాలయాలను ఎంపీడీవో భాగ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

తోడేండ్లపల్లె(నాగలమర్రి): తోడేండ్లపల్లెకు చెందిన విద్యార్థి ప్రభుదేవా పై ఒక్కసారిగా ఆయిదు కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి.

డోన్‌పట్టణం: వైకాపా నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని న్యూహానగర్‌కు చెందిన క్యాబిట్ బాషా మృతి చెందారని తెలుసుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు.

డోన్, న్యూస్‌టుడే: మండలంలో ఎంతో పురాతనమైన ఆలయ పునర్నిర్మాణ పనులు నాలుగునెలలుగా నిలిచాయని, వాటిని చేపట్టేలా చూడాలని గుండాల గ్రామప్రజలు మాజీ మంత్రి బుగ్గనను కోరారు. గుండాల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయాన్ని సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని ఉప తహసీల్దారు బ్రహ్మయ్య కోరారు. పట్టణంలోని బీవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆళ్లగడ్డ: ఉయ్యాలవాడ ఎస్సై బీటీ వెంకటేశ్వర్లు గురువారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో నిజాయతీగా ఉండాలని, ప్రజలకు న్యాయం అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఆమె సూచించారు.

ఆళ్లగడ్డ: మహమ్మద్ ప్రవక్త(స.అ.వ)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని ఆళ్లగడ్డ ముస్లిం ఐకాస అధ్యక్షుడు బి.హుస్సేన్ బాషా డిమాండు చేశారు. హుసేన్, కందుకూరు హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పోలీసు అమరుల వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

తీగలు సరి చేశారు

స్పందనకు వందనం

రూపనగుడి(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: రూపనగుడి ఎస్సీ కాలనీలో విద్యుత్తు తీగల దుస్థితిపై బుధవారం 'ఈనాడు'లో 'వేలాడుతున్న ప్రమాదం' శీర్షికన ప్రచురించిన కథనానికి విద్యుత్తు అధికారి గుర్రప్ప స్పందించి తీగలను సవరించారు.

బనగానపల్లి గ్రామీణం: ఈనెల 18న 'కాల్వలు లేక కలవరం' శీర్షికన ప్రచురించిన కథనానికి మంత్రి బీసీ ఆదేశాల మేరకు ఈవో సతీష్‌కుమార్‌రెడ్డి పరిసరాలు శుభ్రం చేయించారు.

పకడ్బందీగా పశుగణన

డోన్, న్యూస్‌టుడే: డోన్ డివిజన్ పరిధిలో, డోన్ మండలంలో ఈనెల 25 నుంచి పశుగణనను పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా పశువైద్యశాఖ అధికారి గోవిందనాయక్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కోట్లను పశువైద్యశాఖ అధికారులు కలిసి వివరాలు తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పెంపుడు జంతువులు, కోళ్లు, ఇతర పశువుల వివరాలు సేకరించి డిజిటలైజేషన్ చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

ఆళ్లగడ్డ (గ్రామీణం): **సమస్య:** నల్లగట్ల ఎస్సీ కాలనీలో వీధులు మురుగుతో నిండాయి. దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –చంద్రుడు, నల్లగట్ల

సమాధానం: చర్యలు తీసుకుంటాం. –తాహెర్ హుసేన్, ఈవోపీఆర్డీ

సమస్య: బాచేపల్లెలో సచివాలయం పక్కన నీటి ట్యాంకు పాచి పట్టి అపరిశుభ్రంగా మారింది. –హుసేన్, బాచేపల్లె

సమాధానం: చర్యలు తీసుకుంటాం. –నరసింహ, పంచాయతీ కార్యదర్శి.

ఇబ్బందులే వసతి

పరిశీలన

దుప్పట్ల కొరత

చిన్నవంగలి(చాగలమర్రి), న్యూస్‌టుడే: చిన్నవంగలిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో 96 మంది విద్యార్థులకు గానూ 42 మంది మాత్రమే ఉన్నారు. అవసరమైన దుప్పట్లు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. మరుగుదొడ్ల సదుపాయం లేక తిప్పల పాలవుతున్నామని, శుద్ధజలకేంద్రం లేక నీటికి అవస్థలపాలవుతున్నామన్నారు. వార్డు సంరక్షకుడు ఖాశీంను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వంద వరకు దుప్పట్లు వచ్చాయని, వాటిని పంపిణీ చేస్తామని తెలిపారు.


అరకొర దుప్పట్లతో నిద్రిస్తున్న విద్యార్థులు

గత ప్రభుత్వం ఒక్కో దుప్పటిని మాత్రమే ఇవ్వడంతో వసతిగృహ విద్యార్థులు ఇబ్బందులపాలవుతున్నారు. కప్పుకోవడానికి సరిపోతోందని, కింద పర్చుకోవడానికి ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోదుప్పటిని ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు సర్దుబాటు చేసుకుంటున్నారు. చాలా వసతి గృహాల్లో తలుపులు లేకపోవడం, తలుపున్నా.. కిటికీలు లేకపోవడం, కిటికీలు ఉన్నా జాలీలులేక దోమలు విజృంభిస్తున్నాయని, కూటమి ప్రభుత్వమైనా తమ బాధల్ని పట్టించుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

తలుపులు లేక అవస్థలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణంలోని బీసీ వసతి గృహంలో 160 మంది విద్యార్థులు ఉండగా, చాలా మంది దుప్పట్లు లేక ఇబ్బందులుపడుతున్నారు. వసతిగృహంలోని కిటికీలకు జాలీలు లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గదులకు తలుపులు లేకపోవడంతో చలిలోనే నిద్రించాల్సి వస్తోందంటున్నారు.


కిటికీల పరిస్థితి

ఇళ్ల నుంచి తేవాల్సిందే!

అవుకు, న్యూస్‌టుడే: అవుకులోని సమీకృత వసతి గృహంలో దుప్పట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 75 మందికి గానూ 48 మంది రెండు గదుల్లో నిద్రించారు. మూడేళ్ల నుంచి కార్పెట్లు లేకపోవడంతో ఇళ్ల నుంచి కొందరు విద్యార్థులు బొంతల్ని తెచ్చుకున్నారు.


అవుకు వసతిగృహంలో నిద్రిస్తున్న విద్యార్థులు

పర్చుకోవడానికి లేక...

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ఒకే దుప్పటి ఇవ్వడంతో కింద పర్చుకోవడానికి ఏమీలేక విద్యార్థులు ఇబ్బందుపడుతున్నారు. సుమారు 98 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉన్నారు. విద్యుత్తు సౌకర్యం ఉన్నా...మరుగుదొడ్లలో బల్బులు లేవు. వార్డెన్ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా త్వరోనే ప్రతి విద్యార్థికి మరో దుప్పటి అందుబాటులోకి వస్తుందన్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడాదిగా సరఫరా లేక

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని బీసీ బాలుర వసతి గృహంలో 90 మంది విద్యార్థులు ఉండగా..ఏడాదిగా దుప్పట్లు ప్రభుత్వం సరఫరా చేయలేదని విద్యార్థులు వాపోతున్నారు. గతేడాది ఇచ్చిన వాటితోనే సర్దుకుంటున్నామని, అవన్నీ చిరిగిపోతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న చలి కాలం నాటికైనా సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


బీసీ వసతిగృహంలో పడుకున్న విద్యార్థులు

చలికి వణకాల్సిందే!

డోన్ పట్టణం: కొండపేటలో ఎస్సీ బాలుర వసతిగృహంలో ఆరు నుంచి పదో తరగతి వరకు 95 మంది విద్యార్థులకు దుప్పట్లు, కార్పెట్లు పంపిణీ చేయలేదు. 10 గదుల్లో విద్యార్థులు ఉంటున్నారు. వసతి గృహం పాతది కావడంతో శిథిలావస్థకు చేరింది. దీన్ని తొలగించాలని చేసిన ప్రతిపాదనలకు ఇంకా మోక్షం కలగలేదు. వసతిగృహంలోని పై అంతస్తులో ఉన్న ఒక గది తలుపు పాడవ్వడంతో రంధ్రాలు పడ్డాయి.


బాలుర వసతిగృహంలో పైఅంతస్తులో ఉన్న గది తలుపు దుస్థితి

అసౌకర్యాలే దిక్కు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: గొరుమానుకొండ మెట్ట వద్ద ఉన్న ఎంజేపీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు అసౌకర్యాలతో అవస్థలపాలవుతున్నారు. అయిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు 680 మంది చదువుతున్నారు. విద్యార్థులకు కార్పెట్లు, దుప్పట్లు, ట్రంకుపెట్టెలు అరకొరగా అందుతున్నాయి. 639 మాత్రమే వచ్చాయని, దుప్పట్లు ఇంకా రాకపోవడంతో చలికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇంకా 350 మంచాలు రావాలని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని విద్యార్థులు చెబుతున్నారు. త్రీఫేస్ విద్యుత్తు సౌకర్యం, శుద్ధజలం, వేడి నీటి సౌకర్యం లేదు.


దుప్పట్లు లేకుండా నిద్రిస్తున్న విద్యార్థులు

క్రియాశీలకంగా నమోదు చేయించాలి

డోన్, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయం వద్ద డోన్ నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు అన్ని కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలకు ఏదైనా అనుకోని ఘటన జరిగినా మట్టిఖర్చుల కింద రూ.10 వేలు ఇస్తారని, బీమా రూ.5 లక్షల వరకు వస్తుందన్నారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు నాగేశ్వరరావు యాదవ్, రామకృష్ణ, ఫణిరాజ్, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కేశన్న గౌడ్, పెద్దకేశవయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

సమన్వయంతో సమస్యలు పరిష్కరిస్తాం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: అందర్నీ సమన్వయపర్చుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. గురువారం ఉయ్యాలవాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన 125 వినతులను ఆమె స్వీకరించారు. తెదేపా మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖరరెడ్డి, కె.నారాయణరెడ్డి, గడ్డం దస్తగిరిరెడ్డి, పి.రామమోహనరెడ్డి, గోపిరెడ్డి హరినాథరెడ్డి, మద్దూరు రామకృష్ణారెడ్డి, కొట్టాల వెంకటేశ్వరరెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, బోరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

మెరిసిన ప్రతిభ


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక శ్రీసుధ రెసిడెన్షియల్ పాఠశాలలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం'పై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎస్.రిఫత్ (పదో తరగతి), ఆర్.గౌరీకుమార్ (9వ తరగతి), వై.ఇ.హర్షవర్ధన్ గౌడ్ (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. వారికి పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్ మేరీ చార్లెస్, ఉపాధ్యాయులు రవికుమార్, ఎల్.వెంకటరమణ, జులియన్ దక్కర్, రాజేష్, అభిషేక్ ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

సృజనకు పదును


బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

బేతంచెర్ల,న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని ప్రధానోపాధ్యాయులు వై.సురేష్ బాబు, జి.సురేష్ బాబు పేర్కొన్నారు. శ్రీనారాయణ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాలం వినియోగం, లాభాలు, నష్టాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం'పై జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థి ఆదిత్య కృష్ణ, పి.వైష్ణవి ప్రథమ, ద్వితీయ, ఆర్.వాసంతి (9వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె కబుర్లు

పలుకూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జమీలా పేర్కొన్నారు. పలుకూరులో అయోడిన్ ఉప్పుతో కలిగే ప్రయోజనాలపై గర్భిణులు తదితరులకు అవగాహన కల్పించారు.

నందవరం(బనగానపల్లి గ్రామీణం): నందవరంలో డీపీవో జమీవుల్లా గురువారం విచారణ జరిపారు. గ్రామంలో సమస్యల పరిష్కరించడం లేదని, స్థలాలు ఆక్రమణకు గురయ్యాయనే ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు.

బత్తులూరుపాడు(బనగానపల్లి గ్రామీణం): భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నారాయణరెడ్డి పేర్కొన్నారు. బత్తులూరుపాడులో గ్రామసభను గురువారం నిర్వహించారు.

ఇటిక్యాల(కొలిమిగుండ్ల): ఇటిక్యాలకు చెందిన వీఆర్వో చెన్నయ్య పలు అక్రమాలకు పాల్పడటంతో విధుల నుంచి కలెక్టరు సస్పెండ్ చేశారని తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి గురువారం చెప్పారు.

పెండేకల్లు(బేతంచెర్ల): రీసర్వేలో జరిగిన పొరపాట్లను, హెచ్చుతగ్గుల సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రకాష్ బాబు పేర్కొన్నారు. ఎం.పెండేకల్లు గ్రామంలో సర్పంచి ముచ్చు రామకృ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు.

కలుగొట్ల(కోవెలకుంట్ల గ్రామీణం): కలుగొట్లలో శుక్రవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. భూ సర్వేలో సమస్యలుంటే తెలియజేయాలన్నారు.

రాచర్ల (డోన్ నేరవిభాగం): ప్యాపిలి మండలంలోని రాచర్ల గ్రామంలో కర్ణాటకమద్యం, సీతమ్మతాండాలో నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆబ్కారీ ఎస్సైలు సోమశేఖర్ రావు, దౌలత్‌ఖాన్ గురువారం తెలిపారు.

కొత్తకోట(డోన్),న్యూస్‌టుడే: రీ-సర్వే సమస్యలను పరిష్కరించేలా చూస్తామని జిల్లా సర్వేశాఖ ఏడీ జయరాజ్ అన్నారు. కొత్తకోటలో నిర్వహించిన రీసర్వే గ్రామసభలో ఆయన మాట్లాడారు.

బిజనవేముల(కోవెలకుంట్ల గ్రామీణం)న్యూస్‌టుడే: బిజనవేములలో గ్రామసభను ఆర్డీవో మహేశ్వర రెడ్డి తనిఖీ చేశారు. భూ సమస్యల దరఖాస్తులపై వివరాలు తెలుసుకున్నారు.

కోటకొండ(రుద్రవరం): కోటకొండ గ్రామంలోని సచివాలయం వద్ద ఉన్న పంచాయతీ కుళాయి వాల్వును తొలగించడంతో పంచాయతీ సిబ్బందికి తెదేపా నాయకులకు స్వల్ప వాగ్వాదం జరిగింది. పోలీసులు రాకతో వాల్వులను బిగించారు.

చింతకొమ్మదిన్నె(ఆళ్లగడ్డ గ్రామీణం): చింతకొమ్మదిన్నెలో గురువారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: సొంత అల్లుడిని హత్య చేసిన కేసులో అత్తతో పాటు మరొకరికి జీవిత ఖైదు విధిస్తూ ఆళ్లగడ్డ అయిదో అదనపు జిల్లా న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చిందని ఎస్సై పీరయ్య యాదవ్ వివరాలు తెలిపారు. ఆళ్లగడ్డకు చెందిన అహ్మద్ హుస్సేన్ కోటపాడుకు చెందిన హుస్సేన్‌బీని వివాహం చేసుకున్నారు. కుమార్తెను వేధిస్తున్నాడనే కోపంతో అత్త హుస్సేన్‌బీ పరిచయం ఉన్న అదే గ్రామానికి చెందిన హుస్సేన్‌వలితో కలిసి అల్లుడిని హత్య చేయాలని భావించింది. అల్లుడిపై కిరోసిన్‌పోసి నిప్పంటించడంతో కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. అత్త హుస్సేన్‌బీ, హుస్సేన్‌వలిపై శిరివెళ్ల పోలీసులు హత్యకేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువవ్వడంతో జీవిత ఖైదుతోపాటు, చెరో రూ.1000 జరిమానాను జిల్లా అయిదో అదనపు న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ విధించారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మల్లెంపల్లెకు చెందిన మాదన్న(50) వాహనంపై నుంచి వస్తూ అదుపుతప్పి ఊపిరాడక మృతి చెందినట్లు గ్రామీణ సీఐ రాకేశ్ తెలిపారు. ఈనెల 20న వెంకటాపురానికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా ఊరిబయట ఉన్న చెరువు వద్ద వాహనం అదుపుతప్పడంతో చెరువు కింద ముళ్లకంపల్లో పడ్డారు. ఆయనపై ద్విచక్రవాహనం వెళ్లడంతో ఊపిరిఆడక మృతి చెందారు.

డోన్ నేరవిభాగం,న్యూస్‌టుడే: వెంకటాపురం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఓ యువకుడి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గుమ్మకొండకు చెందిన సురేష్(31) పని నిమిత్తం డోన్‌కు వచ్చి తిరిగి గ్రామానికి వెళుతుండగా వెంకటాపురం సమీపంలో కుందేలు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం: ఆర్డీవో


చర్చిస్తున్న మల్లికార్జునరెడ్డి

మల్లెవేముల(చాగలమర్రి), న్యూస్‌టుడే: 44వ జాతీయ రహదారి నిర్మాణంలో భూముల్ని కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రి, మల్లెవేముల గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణంలో రైతులు కోల్పోతున్న భూముల్ని ఆయన పరిశీలించారు.

వృద్ధులపై ఆదరాభిమానాలు చూపాలి

ఓబులాపురం(డోన్), ప్యాపిలి, న్యూస్‌టుడే: వృద్ధులు, అనాథలపై ఆదరాభిమానాలు చూపాలని సీనియర్ సివిల్‌జడ్జి తంగమణి అన్నారు. గురువారం మండలంలోని ఓబులాపురంమిట్ట వద్ద ఉన్న వృద్ధాశ్రమాన్ని ఆమె పరిశీలించారు. వృద్ధులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ఆహారం ఎలా అందుతుంది..? తదితర వివరాలు తెలుసుకున్నారు. ప్యాపిలి బీసీ బాలుర వసతిగృహన్ని ఆమె తనిఖీ చేశారు.


ప్రసంగిస్తున్న తంగమణి

ఆటల్లో మెరిసి... పతకాలతో మురిసి

కస్తూర్బా బాలికలు చదువులతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి తమకు ఎవరూ సాటిరారని నిరూపిస్తున్నారు.
–న్యూస్‌టుడే ఆళ్లగడ్డ గ్రామీణం

రోప్‌స్కిప్పింగ్‌లో స్వర్ణం

రుద్రవరం మండలం తిప్పారెడ్డిపల్లెకు చెందిన హుశేనయ్య, సావిత్రి దంపతుల కుమార్తె పద్మకళ తొమ్మిదో తరగతి చదువుతోంది. వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీలత వద్ద రోప్ స్కిప్పింగ్‌లో తర్ఫీదు పొందారు. నంద్యాలలో జులైలో జరిగిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో చక్కటి ప్రదర్శన ద్వారా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కర్నూలులో ఆగస్టులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి మొదటి స్థానంలో నిలిచి స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. గతేడాది జాతీయ స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లోనూ స్వర్ణాన్ని సొంతం చేసుకొంది. పోలీసు కావడమే లక్ష్యమని పద్మకళ చెబుతోంది.


పద్మకళ

పోలీస్ కావడమే లక్ష్యం

రుద్రవరం మండలానికి చెందిన నరసింహ, లక్ష్మీ దంపతుల కుమార్తె గాయత్రి ఎనిమిదో తరగతి చదువుతోంది. క్రీడలపై ఆసక్తితో వ్యాయామ ఉపాధ్యాయిని శ్రీలత వద్ద రోప్‌స్కిప్పింగ్‌లో తర్ఫీదు పొందింది. నంద్యాలలో జులైలో జరిగిన జిల్లా స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. తర్ఫీదు పొంది మరింత ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరైంది. కర్నూలులో ఆగస్టులో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ ఫ్రీ స్టైల్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి రజతం గెలుపొందింది. పోలీసు కావడమే లక్ష్యమని గాయత్రి చెబుతోంది.


గాయత్రి

విద్యార్థుల ఎంపిక

దొర్నిపాడు, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు గురువారం తెలిపారు. జిల్లాలో అండర్-14లో నాగసుధ, సాయి, అండర్-17లో సౌజన్య ఎంపికయ్యారని, ఈ నెల 26 నుంచి 28 వరకు తెనాలిలో అండర్-14 విభాగంలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. చెన్నయ్య, రమణయ్య, చంద్రశేఖర్‌రావు, నాగరాజు విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు

భక్తిశ్రద్ధలతో దస్తగిరి స్వామి ఉరుసు

అవుకు, న్యూస్‌టుడే: అవుకులో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం గంధం వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు జండాను దర్గా వద్ద ప్రతిష్ఠించి ప్రార్థనలు జరిపారు. శుక్రవారం ఉరుసు సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థుల ఐటీఐ సందర్శన

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలంలోని కంబాలపాడులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతి విద్యార్థులు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు గురువారం డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ట్రైనర్ నాగేంద్రనాయక్ సమక్షంలో సందర్శించారు. ఐటీఐ కళాశాలలో ఉన్న ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, టర్నర్, వెల్డింగ్, డీజిల్ మెకానిక్, సివిల్, మోటార్‌మెకానిక్, వంటి ట్రేడులతో పాటు కంప్యూటర్ కేంద్రాన్ని పరిశీలించారు.



కంబాలపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పిల్లలతో పనులు చేయించడం నేరం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: బాలకార్మికుల చట్టం ప్రకారం ఎవరైనా పిల్లలతో పనులు చేయిస్తే నేరమవుతుందని బనగానపల్లి, డోన్‌లకు చెందిన సహాయక కార్మిక శాఖ అధికారిణులు శోభారాణి, నీలిమ సంధ్య అన్నారు. నేషనల్ ఛైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ ఫర్ రిహాబిలిటేషన్ ఆధ్వర్యంలో కోవెలకుంట్లలో బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ గురువారం చేపట్టారు. కోవెలకుంట్ల వసతి గృహ సంక్షేమాధికారి విజయలక్ష్మి, నంద్యాల కలెక్టరేట్ ఐసీడీఎస్ సామాజిక కార్యకర్త నాగజ్యోతి, లీగల్ కమ్ ప్రొబేషన్ అధికారి సుదర్శన్‌రెడ్డి, స్థానికులు పోలీసులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జలదుర్గం విద్యుత్తు కేంద్రంలో పనులు

ప్యాపిలి, న్యూస్‌టుడే: జలదుర్గం ఉపకేంద్రంలో పనులు చేయాల్సి ఉన్నందున జలదుర్గం ఉప కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు కరెంటు ఉదయం 5 గంటల నుంచి ఇస్తారని, చంద్రపల్లి ఫీడర్ మెయింటెనెన్స్ కారణంగా హుస్సేనాపురంసబ్‌స్టేషన్ పరిధిలోని చంద్రపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు అంతరాయం కలుగుతుందన్నారు. రైతులకు ఇచ్చే కరెంటు ఉదయం 4 గంటల నుంచి ఇస్తారన్నారు.

మురుగు పారదు.. వేదన తీరదు



బాచేపల్లెలోని బీసీ కాలనీలో మురుగు సమస్య వేధిస్తోంది. కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వృథా నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో నిత్యం ఇళ్ల చెంతనే మురుగు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, బాచేపల్లె (ఆళ్లగడ్డ గ్రామీణం)

రాయలసీమ అభివృద్ధి సాధనకు తరలిరండి

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: రాయలసీమ అభివృద్ధి సాధనకు ఈనెల 27న జరిగే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల ఉద్యమకారుడు కామని వేణుగోపాల్‌రెడ్డి సంస్మరణ సభకు ప్రతిఒక్కరూ తరలి రావాలని ప్రజాసంఘాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. పేరా కల్యాణ మండపంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, జొలదరాశి, రాజోలి జలాశయాలు, సిద్ధేశ్వరం అలుగు, కోవెలకుంట్ల నియోజకవర్గ సాధన, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

గుంతలో పడి 40 గొర్రెలు మృతి

ధర్మవరం(డోన్), న్యూస్‌టుడే: ధర్మవరం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో గురువారం సాయంత్రం గుంతలో పడి 40 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెలను మేపేందుకు కొండ ప్రాంతానికి తీసుకెళ్లగా చనిపోయాయన్నారు.